## క్లుప్తంగా

### బాలోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాల్వంచ: ఈనెల 13, 14 తేదీల్లో మధిరలో శ్రీ రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలోత్సవ్‌లో పాల్వంచ డీఏవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విచిత్ర వేషధారణ సీనియర్ విభాగంలో గూడవర్తి శ్రావ్య ప్రథమ, కూచిపూడి నృత్యం సీనియర్ విభాగంలో సీహెచ్ చిన్మయి లహరి తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. పాఠశాలలో గురువారం వీరిని ప్రిన్సిపాల్ ఎ.రామారావు, డాన్స్‌మాస్టర్ జి.వెంకటేశ్వర్లు అభినందించారు.

### నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆటోడ్రైవర్

కొత్తగూడెంఅర్బన్: ఆటో డ్రైవర్‌కు దొరికిన సెల్ ఫోన్‌ను ట్రాఫిక్ పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. కొత్తగూడేనికి చెందిన ఆటో డ్రైవర్ బి.ప్రేమ్‌కుమార్ తనకు సెల్ ఫోన్ దొరికిందని, దానిని తీసుకెళ్లి గురువారం ట్రాఫిక్ పోలీసులకు అప్పగించాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు సెల్‌ఫోన్ యజమానిని ట్రేస్ చేసి అతను కానిస్టేబుల్ తాటి రాజేష్‌గా గుర్తించి ఫోన్‌ను అప్పగించారు.

### అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



పాపకొల్లు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న నిర్మలాజ్యోతి

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు, జూలూరుపాడు, వెంగన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలాజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని, ప్రతీరోజు పిల్లల హాజరును యాప్‌లో నమోదు చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, శంకుతల, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

# మారిన ఎన్నికల తీరు..



గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- డబ్బు ప్రభావమే ఎక్కువ
- పూర్వంతో పోలిస్తే పలు మార్పులు
- ఎన్నికల తీరుపై వయోవృద్ధుల మనోగతం

చుంచుపల్లి: ఇటీవల కాలంలో ఏ ఎన్నికల్లోనైనా డబ్బు ప్రభావం బాగా పెరిగిపోయింది. నేతలు ప్రచార ఆర్భాటాలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ప్రలోభాలతో ఓటు వేయించుకోవచ్చనే భావన అభ్యర్థుల్లో మరింతగా పెరిగిపోయింది. పూర్వంలో జరిగిన ఎన్నికలకు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంది. గతంలో అభ్యర్థుల గుణగణాలక ప్రాధాన్యం ఇచ్చేవారని, ప్రస్తుతం అలాంటివేమీ పట్టించుకోకుండా కేవలం డబ్బుకే ప్రాధాన్యం ఇస్తున్నారని పలువురు వయోవృద్ధులు, సీనియర్ సిటిజన్లు నేటి రాజకీయ పార్టీల పోకడలు, తీరు తెన్నుల వ్యత్యాసాలపై వారి మనోగతం...

### కడదాకా ఒకే పార్టీలో ఉండేవారు



గతంలో పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తుది శ్వాస వరకు అందులోనే కొనసాగేవారు. పార్టీలు మారడానికి ఇష్టపడే వారు కాదు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి. ఉదయం ఓ పార్టీలో చేరి, సాయంత్రానికి మరో పార్టీలోకి వెళ్తున్నారు. సిద్ధాంతాలు గాలికొదిలేసి వ్యక్తిగత స్వార్థం, పదవీ కాంక్షతో పార్టీలు మారుతున్నారు.

– ఎస్.హన్మంతరావు, విద్యానగర్

### డబ్బు ఇవ్వనిదే రావడం లేదు.



పూర్వం ఎన్నికల్లో డబ్బు ప్రభావం కనిపించేది కాదు. అభ్యర్థులు అక్కడక్కడా సమావేశాలు పెట్టి ఎన్నికల ప్రచారం చేసేవారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరిస్తామని హామీలు ఇచ్చేవారు. ఓటర్లు సైతం ఓటును పవిత్రంగా భావించి తమకు నచ్చిన వారికి ఓటేసేవారు. పార్టీ కార్యకర్తలు సైతం డబ్బులు ఇవ్వనిదే ప్రచారానికి రావడం లేదు. దీంతో అభ్యర్థులు హామీలను విస్మరిస్తున్నారు.

– కొల్లు నాగేశ్వరరావు, విద్యానగర్

### ప్రచారం సాదాసీదాగా జరిగేది...



పూర్వం ఎన్నికల ప్రచారం సాదాసీదాగా జరిగేది. అభ్యర్థులు, ఓటర్లు నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. సిద్ధాంతాలు వివరించి ఓట్లు అడిగేవారు ఓటును పవిత్రంగా భావించే వారు. డబ్బులు తీసుకుని ఓట్లు వేయడం మహా అపరాధంగా భావించేవారు. పేద వారు సైతం ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సామాన్యుడు గెలిచే పరిస్థితి లేదు.

– ఎండీ.అమీర్, కొత్తగూడెం

### ఊరి పెద్ద చెబితే వినేవారు..



నాకు 61 ఏళ్లు. నేను తొలిసారి ఓటు వేసే సమయంలో అభ్యర్థులు ఊళ్లో పెద్ద మనుషులను కలిసి మద్దతు కోరేవారు. సమావేశం ఏర్పాటు చేసి పార్టీ సిద్ధాంతాలు, గెలిస్తే ఏం చేస్తారో వివరించేవారు. నిరక్షరాస్యులు అధికంగా ఉండడంతో పెద్ద మనుషులు చెప్పిన వారికి ఓటేసేవారు. ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశంతో ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చింది. నేడు రాజకీయం,ఎన్నికలు పూర్తిగా మారిపోయాయి.

– చౌదం.కృష్ణయ్య, పాపకొల్లు

# 'గూడెం'పై విద్యావంతుల గురి

- బరిలో 30 మంది అభ్యర్థులు
- అత్యధికులు విద్యావంతులే

సుజాతనగర్: జిల్లాలోని ఏకైక జనరల్ నియోజకవర్గమైన కొత్తగూడెం నుంచి ఎన్నికల బరిలో తలపడుతున్న అభ్యర్థుల్లో ఎక్కువమంది విద్యావంతులే ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం మొత్తం 30 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తేలింది. ఇందులో 19 మంది ఇండిపెండెంట్లు ఉన్నారు. కాగా, అభ్యర్థుల్లో పీహెచ్‌డీ, ఎల్ఎల్‌బీ, డిగ్రీ పూర్తి చేసిన వారు పలువురు ఉండడం విశేషం.

**చదువరులే...**

ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి కొప్పుల జీవన్ బీఏ పూర్తి చేయగా, యువతరం పార్టీ అభ్యర్థి పోట్రు ప్రవీణ్‌కుమార్ ఎంటెక్, గోండ్వానా దండ కారణ్య పార్టీ అభ్యర్థి సనప కోటేశ్వరరావు ఎంఏ చదివారు. ఇక బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేష్ పీజీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసి ఎన్నికల బరిలో ఉన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థుల్లో గుమలాపురం సత్యనారాయణ బీకాం, కటుకోజ్వల నాగేశ్వరరావు ఎల్ఎల్‌బీ, దొడ్డపునేని నాగేశ్వరరావు బీటెక్, మాలోత్ శ్రీనివాస్ బీకాం, సూరెడ్డి రమణారెడ్డి బీకాం, బానోత్ రమేష్ ఎంఏ, బీఈడీ, ఎల్ఎల్‌బీ, కల్లీ లెనిన్ డిగ్రీ, గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి బీఎస్సీ నర్సింగ్ చదివారు. వీరే కాకుండా ఐటీఐ, ఇంటర్మీడియట్, ఎస్సెస్సీ చదివిన అభ్యర్థులు బరిలో నిలిచారు. కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు హెచ్ఎస్ఎస్సీ చదివి ఎమ్మెల్యేగా తొమ్మిదో సారి పోటీ చేస్తున్నారు. గతంలో నాలుగు సార్లు గెలిచిన ఈయన ఈసారి గెలిస్తే ఐదో సారి ఎమ్మెల్యేగా గెలిచినట్లవుతుంది. అలాగే, కాంగ్రెస్, జనసమితి బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు బీఏ పూర్తి చేయగా, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేస్తున్న జలగం వెంకటరావు బీఎస్ కంప్యూటర్స్ చదివారు.

# ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేయండి



బీఎల్‌ఓలకు ఓటర్ స్లిప్‌లు అందజేస్తున్న తహసీల్దార్ నాగరాజు

పాల్వంచ: గ్రామాల్లో, పట్టణంలోని ప్రతీ ఇంటికి తిరిగి ఓటర్లకు ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేయాలని తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ స్లిప్‌లను బీఎల్‌ఓలకు అందించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ... ఓటర్లకు స్లిప్‌లను సకాలంలో పంపిణీ చేసి, ఎన్నికల్లో తప్పక తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ఎన్నికల విధులను తప్పక పాటించాలని, ఎక్కడా అలసత్వం చేయరాదన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు తిరుగులేదు.. వనమాకు ఎదురు లేదు

కొత్తగూడెంరూరల్: తన విజయాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల, బంగారు చెలక, పునుకుడు చెలక, మైలారం గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రచార సభల్లో వనమా, ఎడవల్లి కృష్ణ మాట్లాడారు. అందరి చూపు బీఆర్ఎస్ వైపే ఉందని, కంటి ముందు అభ్యర్థి.. ఇంటి ముందు అభివృద్ధి బీఆర్ఎస్ లక్ష్యం అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయాన్ని ఏ శక్తి ఆపలేదని, వనమాకు ఎదురు లేదన్నారు.

**వార్డుల్లో ఇంటింటి ప్రచారం..**

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ బీఆర్ఎస్ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. కాపు సీతాలక్ష్మి, సాహెరబేగం, దామోదర్, కూరపాటి విజయలక్ష్మి, రూప, వనచర్ల విమల, బాలిశెట్టి సత్యభామ, అజ్మీర సుజాత, గుమ్మడెల్లి కల్యాణి, రుక్మాంగధర్ బండారి పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిక...**

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని 23, 33 వార్డుల్లోని వివిధ పార్టీలకు చెందిన పలు కుటుంబాలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు మళ్లీ అందరికీ అందాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోందని, కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ కొత్తగూడెం, పాల్వంచలను జంట నగరాలుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేముల అశోక్, శ్రీనివాసరెడ్డి, రావిరాం బాబు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గణేష్

టేకులపల్లి: ఇల్లెందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా టేకులపల్లికి చెందిన మూడ్ గణేష్ చౌహాన్ నియమితులయ్యారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ బి.రమేష్ బాబు గణేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

### రోడ్డు ప్రమాదం..

ఇల్లెందురూరల్: అశోక్‌నగర్ గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మస్సివాగు గ్రామపంచాయతీ ధర్మారం తండా గ్రామానికి చెందిన దేవేందర్, సాయిలకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని 108 సహాయంతో ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ప్రజలు, ప్రభుత్వానికి వారధి జర్నలిస్టులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్

కొత్తగూడెంఅర్బన్/సింగరేణి(కొత్తగూడెం): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి పని చేస్తూ సమాజ సేవలో నిరంతరం కృషి చేసే పాత్రికేయులు నిజంగా అభినందనీయులని మోడ్రన్ ఇక్రా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. గురువారం రామవరంలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని మోడ్రన్ ఇక్రా స్కూల్‌లో జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించారు. మీడియాపై విద్యార్థులకు అవగహన కల్పించారు. బాసిత్ మాట్లాడుతూ.. సమస్యలకు పరిష్కారం చూపుతూ, చదువులు, క్రీడలు, ఆరోగ్యం పట్ల మీడియా ద్వారా అవగాహన కల్పిస్తూ సమాజ సేవ చేస్తున్నారన్నారు. కాలానుగుణంగా అనేక మార్పులు వచ్చినా పత్రికల ఆదరణ తగ్గలేదని, నేటి యువత పఠనా ఆశక్తి పెంచుకోవాలని సూచించారు. సమాజ సేవ చేస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వం, సమాజం అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా, ఉపాధ్యాయులు నీలా, నసీమా, సరస్వతి, ఖాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓటేయండి: ఎమ్మెల్యే హరిప్రియ




బయ్యారం : వెంకట్రాంపురంలో అభివాదం చేస్తున్న హరిప్రియ



ఇల్లెందు : పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బయ్యారం: ఎమ్మెల్యేగా తాను ఎన్నికయ్యాక జరిగిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తోందని.. ఈ పనులను చూసి మరోమారు తనను గెలిపించాలని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ కోరారు. బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారానికి హాజరైన ఆమె మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాయని తెలిపారు. బయ్యారం చెరువుకు రావాల్సిన సీతారామ జలాలను ఇతర ప్రాంతానికి తరలిస్తున్నా.. గత ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆరోపించారు. తాను సీఎం కేసీఆర్‌తో బయ్యారం, గార్ల మండలాల రైతుల తరపున మాట్లాడి రూ.3,200 కోట్లతో సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు కృషి చేశానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, ఎంపీపీ మౌనికతోపాటు గణేష్, సత్యనారాయణ, కవిత, భద్రయ్య, జగన్, రామకృష్ణ, శ్రీకాంత్, ఐలయ్య, శ్రీను, లక్ష్మణ్, వెంకన్న, సంపత్, రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని ఇర్సులాపురం, కొత్తగూడెం, కాచనపల్లి గ్రామాలకు చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరగా హరిప్రియ కండువాలు కప్పి ఆహ్వానించారు.

**ఇల్లెందు, గార్లలో ప్రచారం...**

ఇల్లెందు/గార్ల: బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి ఎమ్మెల్యే హరిప్రియను గెలిపించాలని కోరుతూ ఇల్లెందులోని పలు వార్డుల్లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇప్పటిలాగే అభివృద్ధి కొనసాగాలంటే హరిప్రియను మరోమారు గెలిపించాలని కోరారు.

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్‌తోపాటుట ఎస్.రంగనాథ్, కొక్కు నాగేశ్వరరావు, గిన్నారపు రజిత, మేకల శ్యాం తదితరులు పాల్గొన్నారు. గార్ల మండలంలోని గ్రామాల్లో జరిగిన ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్‌తో పాటు శీలంశెట్టి రమేష్, రాధాకృష్ణ, భాస్కర్‌రావు, గాజుల గణేష్, రవీందర్, వెంకటేశ్వర్లు, నిర్మల, ఉమేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

పాల్వంచ: కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ తొమ్మిదేళ్ల పాలన సాగించారని సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మండలంలోని కొత్తగుంపు, బంజర, మల్లారం, నరసింహా సగర్, కొత్తూరు, లక్ష్మీదేవిపల్లి ఉల్వనూరు, ఎస్సీ కాలనీల్లో తనను గెలిపించాలని విస్తృత ప్రచారం చేశారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గంలో గతంలో జరిగిన అభివృద్ధి మినహా వనమా చేసిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో పేదలను తన ఇంటి చుట్టూ తిప్పుకుని మోసం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కే ఉందన్నారు. కార్యక్రమంలో నాగ సీతారాములు, యర్రంశెట్టి ముత్తయ్య, జాలే జానకిరెడ్డి, కొండా వెంకన్న, బాలినేని నాగేశ్వరరావు, బుడగం నాగేశ్వరరావు, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం**

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో రాందాస్ నాయక్‌కు ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, టీడీపీ, సీపీఐ శ్రేణులు అడుగడునా నీరాజనం పలికారు. రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. హస్తం గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, కొమ్మినేని పాండురంగారావు, ఎర్రబాబు, చంద్ర నరేంద్ర కుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిక...**

మండలంలోని కాకర్ల, పాపకొల్లు, రాంపురంతండా, చీపురుగూడెం, రాచబండ్లకోయగూడెం గ్రామాల్లోని బీఆర్ఎస్ కుటుంబాలు, నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కాంగ్రెస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్, లేళ్ల వెంకటరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పొన్నెకంటి సతీష్ కుమార్, బానోత్ రమాదేవి, చీమలపాటి కొండయ్య, చీమలపాటి భిక్షం, రోకటి సురేష్ పాల్గొన్నారు.

**వీరభద్రంను గెలిపించండి..**

ప్రతినిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. గురువారం జూలూరుపాడులోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా వీరభద్రం గెలుపు కాంక్షిస్తూ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంఘాలు బలపరిచిన సీపీఎం వైరా ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా వీరభద్రం గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే వీరభద్రంను గెలిపించుకోవాలన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపడం వల్ల ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. యాసా నరేష్, గార్లపాటి వెంకటి, వల్లమల్ల చందర్‌రావు, లకావత్ శ్రీను, బానోత్ ఇస్రా, గడిదేసి కనకరత్నం పాల్గొన్నారు.

ఇల్లెందు: బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు మెరుగు కార్తీక్ యాదవ్ నేతృత్వంలో 22 వార్డులకు చెందిన 200 మంది బీఆర్ఎస్ యూత్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. అంతకు ముందు పట్టణంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో న్యూడెమోక్రసీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచిన మోకాళ్ల కృష్ణను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, ఎన్నికల కన్వీనర్ ఆవునూరి మధు పిలుపునిచ్చారు. మండలంలోని కొమరారం గ్రామంలో గురువారం ఎన్నికల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం న్యూడెమోక్రసీ సాగించిన విప్లవోద్యమంలో ఎంతోమంది అమరులయ్యారని గుర్తు చేశారు. అధికార పార్టీ పోడు భూములకు పట్టాలు ఇస్తామని నమ్మించి అరకొర పంపిణీతో చేతులు దులుపుకుందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, దళితులకు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, రేషన్‌కార్డులు, పేదలకు ఇంటి స్థలాలు వంటివన్నీ గాలికొదిలేసి నేడు మరోసారి ఓటు కోసం ప్రజల ముందుకు వస్తున్నారని, అటువంటి వారికి బుద్ధి చెప్పాలన్నారు. అభ్యర్థి మోకాళ్ల కృష్ణ, జడ సీతారామయ్య, యదళ్లపల్లి సత్యం, బయ్య శారద, ఉమర్, పొడుగు నర్సింహారావు, ఉదయ్ పాల్గొన్నారు.

టేకులపల్లి: పార్టీల జెండాలు మార్చే పాలకవర్గాల అభ్యర్థులను ఓడించాలని, నిత్యం ప్రజల కోసం పని చేసే న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల కృష్ణ ఎన్నికల గుర్తు కుండపై ఓటు వేసి గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఎన్నికల స్టీరింగ్ కమిటీ జిల్లా నాయకుడు దుబాకుల ప్రసాద్, భూక్యా హర్జ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఎన్నికల స్టీరింగ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 22న ఇల్లెందులో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కల్తి వెంకటేశ్వర్లు, నోముల భానుచందర్, భూక్యా నర్సింగ్, రామచందర్, డి.వెంకన్న పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తనను గెలిపించాలని బీఎస్పీ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. మన ఊరు – మన కొత్తగూడెం కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. స్వచ్ఛమైన, న్యాయమైన సుపరిపాలనకు బీఎస్పీ ఒక్కటే ప్రత్యామ్నాయం అని తెలిపారు.

# ఎప్పటికీ ప్రజాభీష్టం మేరకే నడుచుకుంటున్నా..



ఇల్లెందురూరల్ : రోడ్డుషోలో మాట్లాడుతున్న కోరం కనకయ్య



కామేపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కనకయ్య, నాయకులు

ఇల్లెందురూరల్: దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలతోనే కలిసి ఉంటూ ప్రజాభీష్టం మేరకు నడుచుకుంటున్నానని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఇల్లెందు మండలంలోని పలుగ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తాను కొనసాగిన సమయాన అనేక అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. అయితే, ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తరలిస్తామని నమ్మించిన సీఎం కేసీఆర్ రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని శంకుస్థాపనకే పరిమితం చేసిందని ఆరోపించారు. ఈసారి తనను గెలిపిస్తే కొమరారం మండలాన్ని సాధించడమే కాక కాంగ్రెస్ గ్యారంటీల ద్వారా ప్రతీ కుటుంబానికి మేలు జరిగేలా కృషిచేస్తానని తెలిపారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, కాంగ్రెస్, వైఎస్సార్ టీపీ నాయకులు బానోత్ సుజాత, యదళ్లపల్లి అనసూర్య, బానోత్ రోజా, శారద, పులి సైదులు, మండల రాము, పూనెం సురేందర్, మూతి కృష్ణ, కిన్నెర నర్సయ్య, తాటి రాంబాబు పాల్గొన్నారు. కాగా, రోడ్డు షో మధ్యలో కనకయ్య కాలి గాయం తిరగబెట్టడంతో చికిత్స కోసం వెళ్లిపోగా, సర్వేతండా వద్ద వేచి ఉన్న స్థానికులు వాహనంపై ఆయన ఫొటోకు పూలు చల్లి అభిమానం చాటుకున్నారు.

**సైనికుల్లా పని చేయాలి...**

ఇల్లెందు/కామేపల్లి/గార్ల: కాంగ్రెస్ అభ్యర్థి కనకయ్య విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ నాయకుడు మువ్వా విజయబాబు పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ వద్ద ఎన్నికల కార్యాలయాన్ని కోరం కనకయ్య, నాయకుడు గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ పాలనను కోరుకుంటున్నందున కార్యకర్తలు కొద్దిరోజులు కష్టపడితే విజయం సులువవుతుందని తెలిపారు. అనంతరం కనకయ్య మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ మారి తప్పు చేసిన తనను క్షమించాలని కార్యకర్తలను కోరారు. ఇకనుంచి పార్టీ మారే ప్రసక్తి లేదని, కార్యకర్తలను కాపాడుకుంటానని తెలిపారు. తొలుత దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గింజల నరసింహారెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, మద్దినేని రమేష్‌బాబు, దమ్మలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు. ఇక ఇల్లెందులో పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ డీవీ ఆధ్వర్యాన కనకయ్యను గెలిపించాలని ప్రచారం చేశారు. కాగా, అధిష్ఠానం సూచన మేరకు నామినేషన్ ఉపసంహరించుకున్న తాను పార్టీ అభ్యర్థి కనకయ్య విజయానికి కృషి చేస్తానని గార్ల మండలం సీతంపేట ఎంపీటీసీ నాగమణి వెల్లడించారు.

**కళారూపాల ద్వారా ప్రచారం**

టేకులపల్లి: ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యను గెలిపించాలని కోరుతూ టేకులపల్లి మండల కేంద్రంలో గురువారం కళాకారులు ఆటపాటలతో ప్రచారం చేశారు. వాహనం పైనుంచి కళాకారులు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు కళారూపాల ద్వారా వివరించారు.